నియామకం

మణికొండ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మణికొండకు చెందిన డాక్టర్‌ బత్తిని కీర్తిలతా గౌడ్‌ను జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయన నివాసంలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా బీసీల సమస్యలపై రాబోయే రోజుల్లో ఆర్‌.కృష్ణయ్య బాటలో ఉద్యమాలు చేస్తామన్నారు.

గోశాల ఏర్పాటు



మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌ నల్ల పోచమ్మ ఆలయంలో సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గోశాలను ఏర్పాటు చేశారు. గోవుల కోసం షెడ్డు నిర్మించి వాటి సంరక్షణ చేస్తామని సేవా సమితి వారు అన్నారు. గోవును పూజిస్తే కోట్ల మంది దేవతలను పూజించినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



శంషాబాద్‌ రూరల్‌: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మల్కారంలో బుధవారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా దుర్గాదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద దాత భూపాల్‌రెడ్డి, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

సైబరాబాద్‌ కమిషనరేట్‌లో బతుకమ్మ వేడుకలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ కమిషనరేట్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో బుధవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. సైబర్‌ క్రైమ్స్‌ డీసీపీ బాలాదేవి ఆధ్వర్యంలో ఎస్‌బీ డీసీపీ సాయిశ్రీ, చైల్డ్‌ సేఫ్టీ వింగ్‌ డీసీపీ సృజన, ఇతర పోలీసు అధికారులు, పోలీసులు వారి కుటుంబసభ్యులతో కలిసి ఆడిపాడారు. కార్యక్రమంలో సైబరాబాద్‌ సీపీ అవినాష్‌మహంతి, పోలీసు అధికారులు జోయెల్‌ డేవిస్‌, షీటీమ్స్‌ ఇన్‌స్పెక్టర్‌ సునీత, సీఏఓ అడ్మిన్‌ గీత, పోలీసులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



మధుబన్‌ కాలనీలో అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌



కట్ట మైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌



సరస్వతీ దేవి అలంకరణలో కోట మైసమ్మ

సరస్వతీ నమస్తుభ్యం

దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్‌ జోన్‌ పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.
– రాజేంద్రనగర్‌ జోన్‌ బృందం



నార్సింగిలో కౌన్సిలర్‌ యాదవ్‌...



బుద్వేల్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌ రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు



హైదర్షాకోట్‌లో బండ్లగూడ డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి



మణికొండ హుడా కాలనీలో కౌన్సిలర్‌లు వందన, శైలజ



గ్రీన్‌ సిటీ పోచమ్మ ఆలయం వద్ద భక్తులు



ధర్మగిరి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



శంషాబాద్‌లోని నాగలింగేశ్వరాలయంలో సరస్వతీ దేవిగా...



హైదర్‌గూడలో నగదుతో అలంకరించిన అమ్మవారు



హైదర్‌గూడలో ఛత్రపతి శివాజీ యూత్‌ అసోసియేషన్‌ సభ్యులు



పుప్పాలగూడలో పూజల్లో పాల్గొన్న మణికొండ మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌ముదిరాజ్‌



పుప్పాలగూడలో...

సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

బండ్లగూడ: సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌) పేదలకు ఓ వరంగా మారిందని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కిస్మత్‌పూర్‌ ఇందిరమ్మ కాలనీకి చెందిన రాజేష్‌కుమార్‌కు రూ. 50 వేల చెక్కును, ఎర్రకుంట తండాకు చెందిన మూడవత్‌ శోభకు రూ. 30 వేలు, పీరంచెరువు సంగం సిటీ కాలనీకి చెందిన సయ్యద్‌ అబ్దుల్‌ రషీద్‌కు రూ. 60 వేలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. నేతలు గోకరి సురేష్‌గౌడ్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ రాజునాయక్‌, ఇందిరమ్మ, స్వామి, ప్రవీణ్‌గౌడ్‌, రమేష్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత



పుస్తకాలను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్‌ శ్రీధర్‌

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని విజయ గణపతి దేవాలయ కమిటీ చైర్మన్‌ టి.శ్రీధర్‌ పేర్కొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయంలో విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవచ్చన్నారు. క్రమ శిక్షణ, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చునన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో యువతులు

మణికొండ: బతుకమ్మ వేడుకలను బుధవారం మణికొండ మున్సిపల్‌ కార్యాయలం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్‌ కార్మికులు, సిబ్బంది, కౌన్సిలర్‌లు బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొన్నారు. రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి వాటి చుట్టూ ఆట పాటలతో తిరిగి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్‌లు ఎల్‌.వందన నగేష్‌, మీనా ముత్యాలు, జ్యోతి మల్లేష్‌, బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, యాలాల లావణ్య నరేష్‌, పి. శైలజ, కోఆప్షన్‌ సభ్యురాలు జె. లక్ష్మీరాములు, కార్యాలయ సిబ్బంది, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు పటిష్ట ప్రణాళిక: డీసీ



వసూలు చేసిన ఆస్తిపన్నును డీసీ రవికుమార్‌కు అందజేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్‌: ఆస్తిపన్ను వసూలు కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు రాజేంద్రనగర్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌ వెల్లడించారు. కాటేదాన్‌ ప్రాంతానికి చెందిన ఆస్తిపన్నుదారుల నుంచి రూ. 25 లక్షల 56 వేలకు సంబంధించిన చెక్కును ట్యాక్స్‌ కలెక్టర్‌ వసూలు చేసి రెవెన్యూ అధికారితో కలిసి బుధవారం డీసీ రవి కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్‌ మాట్లాడుతూ... ప్రస్తుతం ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు రోజువారి వసూళ్లపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. రోజూ సమావేశాలు నిర్వహించుకుంటూ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే నోటీసులను అందించామన్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని కోరారు.

ఏజీవర్సిటీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మలతో రిజిస్ట్రార్‌, ఉద్యోగినులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి బతుకమ్మలకు పూజలు చేశారు. బతుకమ్మ మన సంస్కృతికి ప్రతీక అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పరిపాలన భవనం ఎదుట బతుకమ్మలను పెట్టి మహిళా ఉద్యోగినులు బతుకమ్మ ఆడారు.



బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. తమ ఫిర్యాదులపై స్పందించి సమస్యలను పరిష్కరించినందున వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు బుధవారం ఆయనను మెరాజ్‌ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు కట్టుబడి ఉంటానన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు తాను ప్రత్యేకంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పాదయాత్రలు చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకులు సయ్యద్‌ ఆజామ్‌ తదితరులున్నారు.

ఎస్సీ కమిషన్‌ మాజీ సభ్యుడు నర్సింహ అరెస్టు

శంషాబాద్‌ రూరల్‌: డబ్బులు డిమాండ్‌ చేసిన కేసులో ఎస్సీ కమిషన్‌ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహను పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ముచ్చింతల్‌కు చెందిన నర్సింహా అదే గ్రామ శివారులో ఉన్న జీబీఎం గార్డెన్‌ సిబ్బంది మోహన్‌రావుకు గతంలో వాట్సాప్‌ కాల్‌ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో అతనికి కొంత డబ్బు ఇచ్చాడు. తర్వాత మరోసారి డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించగా.. అతని వేధింపులు తట్టుకోలేని మోహన్‌రావు శంషాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నర్సింహను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్‌

చార్మినార్‌: పిల్లిగుడిసెల్‌ డబుల్‌ బెడ్‌ రూం కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా రూ.5 లక్షలతో కొత్తగా పైప్‌లైన్‌ ఏర్పాటు చేయించినట్లు జలమండలి డైరెక్టర్‌ (ఆపరేషన్‌)–1 శ్యాంసుందర్‌ నాయక్‌ తెలిపారు. మలక్‌పేట్‌ ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల ఆదేశాల మేరకు కొత్తగా తాగునీటి పైప్‌లైన్‌ వేశామన్నారు. మొన్నటి వరకు 141 కుటుంబాలు మాత్రమే ఇక్కడ నివాసం ఉండే వారని.. మూసీ సుందరీకరణలో భాగంగా చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌ బస్తీవాసులను పిల్లిగుడిసెల్‌ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్‌ కాలనీకి తరలించడంతో ప్రస్తుతం 288 కుటుంబాలుంటున్నాయని..వీరి సౌకర్యార్థం కొత్తగా పైప్‌లైను వేశామన్నారు. జలమండలి డీజీఎం మరళీ మనోహర్‌, చంచల్‌గూడ జలమండలి మేనేజర్‌ నవీన్‌, కాలనీ అధ్యక్షుడు సయ్యద్‌ మస్తాన్‌, ఉపాధ్యక్షులు పిల్లి గణేష్‌, ప్రధాన కార్యదర్శి మన్సూర్‌, సంయుక్త కార్యదర్శి మహ్మద్‌ తాహెర్‌ అలీ, యూసుఫ్‌, ఘనీ తదితరులు పాల్గొన్నారు.



వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్‌ రూరల్‌: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... బెంగళూరు జాతీయ రహదారిపై గండిగూడ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి(55) నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో షాద్‌నగర్‌ వైపు నుంచి శంషాబాద్‌ వస్తున్న వాహనం అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అతన్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడు పరిసర ప్రాంతాల్లో కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. మృతుడి ఒంటిపై నీలిరంగు షర్టు, గ్రే కలర్‌ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మణికొండలో ప్రపంచ తపాలా దినోత్సవం



పోస్టాఫీస్‌లో మొక్కలు నాటిన అధికారులు

మణికొండ: ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా మణికొండ పోస్టాఫీస్‌ నుంచి రెండు కిలో మీటర్ల ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌ తపాలా డివిజన్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌ సి.హెచ్‌.రామకృష్ణ, స్థానిక కౌన్సిలర్‌ కె. రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోస్టల్‌ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఎన్ని ప్రచార సాధనాలు వచ్చినా పోస్టల్‌ సేవలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోస్టాఫీస్‌లతో పాటు సిబ్బందిని పెంచి సత్వర సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మణికొండ, చిత్రపురి కాలనీ, కొత్తగూడ, బంజారాహిల్స్‌, ఐబీ లైన్స్‌ తపాలా కార్యాలయాలకు చెందిన సిబ్బంది, పోస్ట్‌మెన్‌లు ఫిట్‌ పోస్ట్‌–ఫిట్‌ ఇండియా, డాక్‌ సేవా–జన్‌ సేవ అనే నినాదాలు ఇస్తూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు మణికొండ పోస్టాఫీస్‌లో ఏక్‌ పేడ్‌ మాకే నామ్‌ పిలుపు మేరకు మొక్కలు నాటారు. సబ్‌ డివిజన్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ శిల్ప, అధికారులు శ్రీనివాస్‌ నాయక్‌, సబ్‌పోస్టు మాస్టర్‌లు, పీఆర్‌ఐలు, పోస్ట్‌ మ్యాన్‌లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

అత్తాపూర్‌: మహిళలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకొనే బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం లేకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర కొమురయ్య అన్నారు. ఈ నెల 10వ తేదీన పెద్దతాళ్లకుంటలో జరిగే బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ... హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, శివానగర్‌, కృష్ణానగర్‌, కేశవనగర్‌, రాధాకృష్ణనగర్‌, కాంతారెడ్డినగర్‌ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆటపాటలతో ఆడుకుంటూ బతుకమ్మలతో విచ్చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో కుంటలో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని, తాత్కాలిక బేబీ పాండ్‌లను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజులను కోరామన్నారు. రాత్రి సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో లైటింగ్‌ ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్‌, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సమాజం ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్‌కుమార్‌, కాకులారం కృష్ణ, ఎల్‌.వెంకటేష్‌, ఎం.ఉపేందర్‌రెడ్డి, ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, ఎం.రామ్‌రెడ్డి, గొల్ల అనిల్‌యాదవ్‌, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, శానిటేషన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్‌: బీజేపీ నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి యువత నుంచి విశేష స్పందన లభిస్తున్నదని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు సంజయ్‌ ఘనాటే అన్నారు. రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఎర్రబోడలో బుధవారం ఆన్‌లైన్‌ సభ్యత్వంలో భాగంగా నిర్వహించిన సభ్యత్వ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వాన్ని పొందుతున్నారన్నారు. ప్రతి బూత్‌లో 200 మందిచే సభ్యత్వాలను నమోదు చేయించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొమురయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేశ్‌, డివిజన్‌ అధ్యక్షులు మల్లేష్‌ చారి, ఎల్‌.వెంకటేశ్‌, హరినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

గచ్చిబౌలి: ప్రజా సంక్షేమం...శేరిలింగంపల్లి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు.శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లలో రూ.5.10 కోట్ల వ్యయంతో చేపట్టే సీసీరోడ్లు, లింకురోడ్లు, బాక్స్‌టైప్‌ కల్వర్టు నిర్మాణ పనులకు ఆయన కార్పొరేటర్లు, అధికారులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలలో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామి నియోజకవర్గంగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, హమీద్‌పటేల్‌, రాగం నాగేందర్‌యాదవ్‌, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు